క్లుప్తంగా

నేడు విద్యుత్ అంతరాయం

జగిత్యాల: మల్యాల విద్యుత్ సబ్‌స్టేషన్ 33/11కేవీలో మరమ్మతుల నేపథ్యంలో శుక్రవారం మధ్యాహ్నం 2గంటల నుంచి 5గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని విద్యుత్ అధికారులు తెలిపారు. మల్యాల, ముత్యంపేట, రాజారం, నూకపల్లి గ్రామాల్లో సరఫరా ఉండదన్నారు.

కాంగ్రెస్ పార్టీలో చేరిన నాయకులు

జగిత్యాలరూరల్: బాలెపల్లి గ్రామానికి చెందిన కురుమ, రజక సంఘాల నాయకులు గురువారం రాత్రి ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. న్యాయవాది పడిగెల జనార్దన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ గుంటి గంగారాం పాల్గొన్నారు.

రామన్నపేటలో ఉచిత వైద్యశిబిరం

జగిత్యాల: మల్యాల మండలం రామన్నపేట గ్రామంలో సన్‌షైన్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. బీపీ, షుగర్ పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. డాక్టర్ శిరీష, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు నేరెళ్ల సతీశ్‌రెడ్డి, గడ్డం మల్లారెడ్డి, ఆనంద్, గుండేటి వినయ్ పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్ల పంపిణీ



పరీక్ష ప్యాడ్లు అందిస్తున్న జమాతే ఇస్లామి హింద్ సభ్యులు

రాయికల్: పట్టణంలోని ప్రగతి, విశ్వశాంతి హైస్కూల్‌లో పదోతరగతి చదువుతున్న విద్యార్థులకు గురువారం జమాతే హింద్ అనుబంధ సంస్థ గరల్స్ ఇస్లామి హింద్ ఆధ్వర్యంలో పరీక్ష ప్యాడ్లను పంపిణీ చేశారు. కరస్పాండెంట్ బాలె శేఖర్, మచ్చ గంగాధర్, సభ్యులు ఫాతిమా, నాయకులు షంషీర్, నయీం, మజహర్, సానియా, ముస్కాన్ తదితరులు పాల్గొన్నారు.

అదుపుతప్పిన డీసీఎం

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి పట్టణ శివారులోని వట్టివాగు వద్ద బ్రిడ్జిపై స్వల్ప ప్రమాదం చోటుచేసుకుంది. గురువారం నిజామాబాద్ వైపు వెళ్తున్న డీసీఎం బ్రిడ్జి వద్దకు రాగానే ఒక్కసారిగా అదుపుతప్పింది. అక్కడే ఉన్న బ్లింకర్ సిగ్నల్ పోల్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎలాంటి అపాయం జరగలేదు.

ప్రొటోకాల్‌పై మాట్లాడే అర్హత లేదు



వేంపేటలో మాట్లాడుతున్న నాయకులు

మెట్‌పల్లిరూరల్: కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్‌కు ప్రొటోకాల్‌పై మాట్లాడే అర్హత లేదని మెట్‌పల్లి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి అన్నారు. గురువారం వేంపేటలో కాంగ్రెస్ నాయకులు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మండల అధ్యక్షుడు అంజిరెడ్డి, ప్రవీణ్, సురేందర్‌రెడ్డి, లింగారెడ్డి, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పేదింటి ఆడపిల్లలకు వరం కల్యాణలక్ష్మి



చెక్కులు అందిస్తున్న ఎంపీపీ రేవతి, జెడ్పీటీసీ భూమయ్య, తహసీల్దార్

కథలాపూర్: పేదింటి ఆడపిల్లలకు వరం కల్యాణలక్ష్మి పథకం అని కథలాపూర్ ఎంపీపీ జవ్వాజి రేవతి, జెడ్పీటీసీ నాగం భూమయ్య అన్నారు. గురువారం తహసీల్ కార్యాలయంలో వివిధ గ్రామాలకు చెందిన 59 మందికి కల్యాణలక్ష్మి పథకం చెక్కులను అందించారు. తహసీల్దార్ ముంతాజిబొద్దీన్, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్‌గౌడ్, వైస్ ఎంపీపీ కిరణ్‌రావు, ఎంపీటీసీలు బొడ్డు బాలు, దొప్పల హైమావతి, మల్యాల రమేశ్, పులి హరిప్రసాద్, జలంధర్, నాయకులు పాల్గొన్నారు.

ఇంపాక్ట్ ఫౌండేషన్ సర్టిఫైడ్ ట్రైనర్‌గా మునేశ్వర్

మేడిపల్లి: తొంబరావుపేట గ్రామానికి చెందిన అల్లగట్ల రాజమునేశ్వర్ సర్టిఫైడ్ ట్రైనర్‌గా అర్హత పత్రాన్ని అందుకున్నారు. ఇంపాక్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 38 రోజులు ఆన్‌లైన్ తరగతులకు హాజరయ్యారు. శని, ఆదివారాలు రెండు రోజులపాటు సికింద్రాబాద్‌లోని మినర్వా గ్రాండ్ 3 స్టార్ హోటల్లో జరిగిన ఆఫ్‌లైన్ శిక్షణ కార్యక్రమంలో ప్రతిభ కనబరిచి మోటివేషనల్ సర్టిఫైడ్ ట్రైనర్‌గా రిటైర్డ్ ప్రొఫెసర్ విశ్వనాథం ఇంపాక్ట్ ప్రతినిధుల చేతుల మీదుగా ధ్రువీకరణ పత్రాన్ని అందుకున్నారు.

ఇళ్ల నిర్మాణానికి తొలగిన ఇబ్బందులు

- మన ఇసుక వాహనంతో అక్రమ రవాణాకు చెక్
- ఆన్‌లైన్‌లో లబ్ధిదారుల బుకింగ్



మన ఇసుక వాహనంలో లబ్ధిదారుకు చేరిన ఇసుక, ఆన్‌లైన్‌లో బుక్ చేసిన రశీదు(ఇన్‌సెట్)

సారంగాపూర్: ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రభుత్వం తీసుకున్న చర్యలు సత్ఫలితాలు ఇస్తున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో ఇళ్లు, ఇతర నిర్మాణాల కోసం ఆయా గ్రామాల ప్రజలు గోదావరి ఇసుకను తీసుకురావాలంటే చాలా అవస్థలు పడేవారు. జగిత్యాల పట్టణంలో ఇసుక రీచ్ పాయింట్‌ను ఏర్పాటు చేసినప్పటికి అక్కడి నుంచి ఇసుకను తెప్పించుకోవడానికి తీవ్ర అవస్థలు పడుతుండేవారు. ప్రస్తుతం ప్రభుత్వం ఆన్‌లైన్ విధానంలో గోదావరి ఇసుకను తెప్పించుకోవడానికి మన ఇసుక వాహనం పేరుతో ఆన్‌లైన్‌లో ఇంటి నుంచే తమ ఫోన్‌లో ఇసుకను బుక్ చేసుకోగానే ఇసుక లబ్ధిదారుడికి అందుతోంది.

ఇళ్ల నిర్మాణాలకు ఇబ్బందులు

గ్రామీణ ప్రాంతాల్లో ఇళ్ల నిర్మాణాలకు ఇసుక సేకరణకు ఇంటి నిర్మాణ యజమాని తీవ్ర అవస్థలు పడుతుండేవారు. సారంగాపూర్, బీర్‌పూర్ మండలాలకు ప్రధానంగా ఇళ్లు, ఇతర నిర్మాణాలకు ఇసుకను బీర్‌పూర్, ధర్మపురి మండలాల్లోని గోదావరి తీరం వెంబడి గ్రామాలు చిన్న కొల్వాయి, ఆరెపల్లి, చిత్రవేణిగూడెం గ్రామాల నుంచి ఎక్కువగా ఇసుక వస్తుండేది. ఇసుకను ట్రాక్టర్లతో తీసుకువచ్చేందుకు రూ. 4,500 నుండి రూ. 5 వేల వరకు వసూళ్లు చేస్తుండేవారు. ఇసుకను తీసుకవస్తున్న సమయంలో ఎక్కడైన రెవెన్యూ అధికారులు, పోలీస్ అధికారులు పట్టుకున్నా ట్రాక్టర్‌పై కేసు నమోదైతే అటు ట్రాక్టరు యజమాని, ఇటు ఇసుక కావలిసిన వారు చాలా సమస్యలు ఉత్పన్నమయ్యాయి.

ప్రస్తుత విధానంతో సులువుగా ఇసుక

సారంగాపూర్, బీర్‌పూర్ మండలాలకు ప్రస్తుతం ఇసుకను మైనింగ్ అధికారులు ధర్మపురి మండలం ఆరెపల్లి గోదావరి నుంచి ఇసుకను అనుమతుల ఆధారంగా సరఫరా చేస్తున్నారు.

ఇసుక కావలిసిన వారు మన ఇసుక వాహనం పేరుతో ఆన్‌లైన్‌లో బుక్ చేయగానే లబ్ధిదారుడి పూర్తి వివరాలు వస్తాయి. అందులో సారంగాపూర్ అని నమోదు చేయగానే ఆరెపల్లి నుంచి 16 కిలోమీటర్ల దూరం అని పేర్కొంటుంది.

ఒక ట్రాక్టర్‌లో మూడు క్యూబిక్ మీటర్ల గోదావరి ఇసుక వస్తుంది. సారంగాపూర్ మండల కేంద్రానికి దూరం ఆధారంగా ఒక ట్రాక్టర్ ఇసుకకు రూ. 2,345 ఆన్‌లైన్‌లో చెల్లించగానే మీకు ఏరోజు ఇసుక అందుతుందన్న సమాచారం వస్తుంది. సరిగ్గా ఆ రోజు నాణ్యమైన గోదావరి ఇసుక లబ్ధిదారుడి ఇంటికి వస్తుంది. దీంతో ఇళ్ల నిర్మాణానికి ఈ విధానంలో ఇసుకను తెప్పించుకుంటున్నారు.

సారంగాపూర్ గ్రామానికి ట్రాక్టర్‌లో మూడు క్యూబిక్ మీటర్ల ఇసుక వచ్చి చేరగానే వెంటనే ట్రాక్టర్ ఓనరు అకౌంట్‌లో ట్రాక్టర్ కిరాయి, ప్రభుత్వానికి చెల్లింపులు వెంటనే జరుగుతున్నాయి.

దళారుల దందా

ఇసుక విధానంపై ప్రజల్లో ఇంకా పూర్తి అవగాహన రాలేదు. దీంతో గ్రామాల్లో ఇంకా ఇసుక దందా చేస్తున్న దళారులపై ప్రజలు ఆధారపడి ఇసుకను తెప్పించుకుంటున్నారు. ఇటీవల బీర్‌పూర్ పోలీసులు ఇసుకను గోదావరి నుంచి అక్రమంగా తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను, జేసీబీని సీజ్ చేసి, కేసు నమోదు చేశారు.

ఇబ్బందులు లేకుండా మంచి విధానం



ఇళ్ల నిర్మాణం కోసం ఇసుకను తెచ్చుకోవడం ఇప్పటి వరకు చాలా సమస్యగా ఉండేది. మన ఇసుక వాహనం విధానంలో లబ్ధిదారుడికి ఎలాంటి ఇబ్బంది లేకుండా ఇసుక చేరుతోంది. మాకు కూడ టెన్షన్ లేకుండా ప్రభుత్వ అనుమతులతో ఇసుక తీసుకరావడంతో సంతోషంగా ఉంది.

– కె.మధుసూదన్‌రెడ్డి, సారంగాపూర్

ప్రభుత్వ నిర్ణయంతో అక్రమార్కులకు చెక్



ప్రభుత్వం ఇంటి వద్దకు ఇసుకను నామమాత్రపు ధరలతో ఇసుకను పంపించడం సంతోషంగా ఉంది. దీని ద్వారా ఇసుక అక్రమ రవాణాను అరికట్టడమే కాకుండా లబ్ధిదారుడికి, ప్రభుత్వానికి, ట్రాక్టర్ యజమానులకు లాభదాయకంగా ఉంది. ఇళ్లు నిర్మించుకునే వారికికూడా తక్కువ ధరలో ఇసుక లభిస్తుంది.

– న్యారబోయిన గంగాధర్, సారంగాపూర్

సామాజిక మిత్రుల ఔదార్యం

- గల్ఫ్ బాధితుడి కుటుంబానికి రూ.1.10లక్షల సాయం



మృతుడి కుటుంబానికి బాండ్ అందిస్తున్న మేనేజర్

ధర్మపురి: కుటుంబ పోషణ, కూతుళ్ల వివాహానికి చేసిన అప్పు తీర్చడానికి సౌదీకి వలసవెళ్లిన ఓ గల్ఫ్ కార్మికుడిని విధి వెక్కిరించింది. అనారోగ్యం బారినపడి అక్కడే మృతిచెందాడు. దీంతో ఆ కుటుంబం మరింత ఆర్థికంగా ఇబ్బంది పడుతోంది. స్పందించిన సామాజిక మిత్రులు బాధితుడి కుటుంబానికి రూ.1.10 లక్షలు సాయం అందించి తమ ఔదార్యాన్ని చాటుకున్నారు. మండలంలోని దమ్మన్నపేటకు చెందిన పులిశెట్టి రాజన్నకు భార్య, ఇద్దరు కూతుళ్లు, ఓ కుమారుడు ఉన్నారు. గల్ఫ్ వెళ్లి వస్తున్నా.. కుటుంబ పోషణకే సరిపోయేది. గతేడాది అప్పు చేసి ఇద్దరు కూతుళ్ల వివాహం చేశాడు. కుమారుడు చదువుకుంటున్నాడు. పదినెలల క్రితం తిరిగి సౌదీ వెళ్లాడు. మూడు నెలల క్రితం పక్షవాతం వచ్చి మంచానికే పరిమితమయ్యాడు. అక్కడ సరైన వైద్యం అందక జనవరి 4న మృతిచెందాడు. అతడి కుటుంబ ఆర్థిక సమస్యలను తెలుసుకున్న ధర్మపురికి చెందిన సామాజిక సేవకుడు రేణికుంట రమేశ్ వారికి సాయం అందించాలని భావించాడు. ఈనెల 4న ఫేస్‌బుక్‌లో రాజన్న కుటుంబ సమస్యలను వివరిస్తూ.. సాయం అందించాలని పోస్ట్ చేశాడు. ఆయన పోస్టుకు స్పందించిన తెలుగు రాష్ట్రాల చెందిన ఎన్నారైలు, బళ్లారికి చెందిన మిత్రులు మృతుడి భార్య లక్ష్మి బ్యాంకు ఖాతాకు రూ.1.10 లక్షలు సాయం అందించారు. వాటిలో కొంత డబ్బులు ఫిక్స్ డిపాజిట్ చేయించి యూనియన్ బ్యాంకు మేనేజర్ రవితేజ చేతుల మీదుగా ఆమెకు అందించారు. మృతుడి కుటుంబ సభ్యులు రమేశ్‌తోపాటు దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.

చట్టాన్ని ప్రతి ఒక్కరూ గౌరవించాలి

పెగడపల్లి: చట్టాన్ని ప్రతి ఒక్కరూ గౌరవించాలని అధికారులు సూచించారు. సుద్దపల్లి గ్రామంలో సివిల్ రైట్స్ డే నిర్వహించారు. సీనియర్ అసిస్టెంట్ ఆంజనేయులు, పంచాయతీ కార్యదర్శి ఎండీ నదీం, వివిధ పార్టీల నాయకులు, అంబేడ్కర్ సంఘం నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.

కథలాపూర్: మండల కేంద్రంలో సివిల్ రైట్స్ డే కార్యక్రమం నిర్వహించారు. తహసీల్దార్ ముంతాజిబొద్దీన్, ఎంఈవో ఆనందరావు, ఎంపీవో తాఖీర్ అహ్మద్, ఆర్‌ఐ నాగేశ్, కార్యదర్శి సాయినాథ్, సీఆర్‌పీ గణేశ్, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

పోచమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ

జగిత్యాలరూరల్: గుల్లపేట గ్రామంలో పోచమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎంపీటీసీ సురేందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ తిరుపతి పాల్గొన్నారు.

ఆటపాటలతో వీడ్కోలు



నృత్యం చేస్తున్న విద్యార్థులు

ఇబ్రహీంపట్నం: మండల కేంద్రంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం 9వతరగతి విద్యార్థులు 10వతరగతి విద్యార్థులకు ఆటపాటలతో వీడ్కోలు పలికారు. ప్రధానోపాధ్యాయుడు రాజన్న, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గీత పారిశ్రామిక సహకార సంఘాలను బలోపేతం చేద్దాం



మల్లాపూర్ గీత పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్ష, కార్యవర్గ సభ్యులు

మల్లాపూర్: గీత పారిశ్రామిక సహకార సంఘాలను బలోపేతం చేసుకుందామని మల్లాపూర్ గీత పారిశ్రామిక సంఘం అధ్యక్షుడు ముద్దం శరత్‌గౌడ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో గీత పారిశ్రామిక సహకార సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా బండి సంజయ్, సభ్యులుగా గొట్టిపడత నారాయణ, పెరుమాండ్ల అర్జున్, అల్లాల నర్సయ్య, సార రవికుమార్, పోతుగంటి అనంతస్వామి, గొట్టిపడత సత్యనారాయణ, అల్లాల పరశురాం ఎన్నికయ్యారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు



మల్లాపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రం నుంచి బయటకు వస్తున్న విద్యార్థులు

మల్లాపూర్: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రంలో గురువారం ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. తెలుగు పరీక్షకు మొత్తం 241 మంది విద్యార్థులకు గాను నలుగురు గైర్హాజరయ్యారని పరీక్షల ముఖ్య నిర్వహణ అధికారి ఎంఏ కాలిక్, శాఖ అధికారి నర్సయ్య తెలిపారు. పరీక్ష కేంద్రాన్ని సిట్టింగ్ స్క్వాడ్ ఎండీ హబీబ్ తనిఖీ చేశారు.

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. 247 మంది విద్యార్థులకు గాను 247 మంది హాజరైనట్లు ప్రిన్సిపాల్ సంజీవ్ తెలిపారు.

ధర్మపురి: ధర్మపురి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం ఇంటర్ సెకండీయర్ తెలుగు పరీక్షలను ప్రారంభించారు. చీఫ్ సూపరింటెండెంట్ రామయ్య ఆధ్వర్యంలో ధర్మపురి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. కళాశాలలోని 7 గదుల్లో పరీక్షలు నిర్వహించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలతోపాటు మగ్గిడి మోడల్ స్కూల్, మైనార్టీ వెల్ఫేర్ కళాశాలలకు చెందిన 276 మంది విద్యార్థులకు గాను ఇద్దరు గైర్హాజరయ్యారు.

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



కలెక్టరేట్ ఎదుట నిరసనలో భవన నిర్మాణ కార్మికులు

జగిత్యాలటౌన్: భవన నిర్మాణ రంగంలో పని చేస్తున్న కార్మికుల సమస్యలను కేంద్రం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు సుతారి రాములు కోరారు. దేశవ్యాప్త నిరసన కార్యక్రమంలో భాగంగా గురువారం కలెక్టరేట్ ఎదుట భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో కార్మికులు నిరసన తెలిపారు. అనంతరం కలెక్టరేట్‌లో వినతి పత్రం అందజేశారు. ప్రధాన కార్యదర్శి రామిల్ల రాంబాబు, ఉపాధ్యక్షుడు కిరణ్‌కుమార్, సహాయ కార్యదర్శి వంశీకృష్ణ, కోశాధికారి గంగారాం, వెన్న మహేశ్ పాల్గొన్నారు.

పెరిగిన కరువు భత్యం అమలు చేయాలి

కోరుట్ల: బీడీ కార్మికులకు పెరిగిన కరువు భత్యం వెంటనే అమలు చేయాలని తెలంగాణ బీడీ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుతారి రాములు డిమాండ్ చేశారు. గురువారం తెలంగాణ బీడీ మ్యానుఫ్యాక్చర్స్ అసోసియేషన్‌కు వినతి పత్రం సమర్పించారు. బీడీ ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు బి.గోవర్ధన్, ఎండీ ముఖ్రం, గంగారెడ్డి, లక్ష్మణ్, భానుప్రసాద్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఇష్టపడి చదవాలి

పెగడపల్లి: కష్టపడి కాకుండా ఇష్టపడి చదవాలని ఇంపాక్ట్ ట్రైనర్ పవన్ విద్యార్థులకు సూచించారు. పరీక్షలపై భయం వీడి ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగితే విజయం మీవెంటే ఉంటుందన్నారు. నామాపూర్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు గురువారం పదోతరగతి, ఇతర విద్యార్థులకు మోటివేషన్ తరగతులు నిర్వహించి పరీక్షల సంసిద్ధతపై అవగాహన కల్పించారు. హెచ్‌ఎం సులోచన, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాయికల్: విద్యార్థులు కష్టపడి చదివినప్పుడే ఉన్నత స్థానానికి ఎదుగుతారని రాయికల్ మున్సిపల్ చైర్మన్ మోర హన్మాండ్లు అన్నారు. పట్టణంలోని గ్రీన్‌వుడ్ పాఠశాలలో వార్షిక వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విద్యార్థుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఎంపీపీ లావుడ్యా సంధ్యారాణి, జెడ్పీటీసీ జాదవ్ అశ్విని, తహసీల్దార్ ఖయ్యూం, మున్సిపల్ వైస్ చైర్మన్, ప్రిన్సిపాల్ తదితరులు పాల్గొన్నారు.

రాయికల్: క్రీడల ద్వారా విద్యార్థుల్లో మానసికోల్లాసం పెరుగుతుందని తహసీల్దార్ ఖయ్యూం అన్నారు. గురువారం పట్టణంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో నిర్వహించిన స్పోర్ట్స్‌మీట్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రిన్సిపాల్ వేణుగోపాల్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం

ఆలయ అభివృద్ధికి విరాళం అందజేత



ఆలయ కమిటీ సభ్యులకు విరాళం అందిస్తున్న కిషన్

పెగడపల్లి: మండల కేంద్రంలోని శ్రీరాజరాజేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి వెంగళాయిపేట గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు చెట్ల కిషన్ విరాళంగా రూ.10,116 గురువారం ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. సభ్యులు కిషన్‌ను అభినందించారు. చైర్మన్ భూమిడి గంగారెడ్డి, ప్రధాన కార్యదర్శి పోచయ్య, ప్రచార కార్యదర్శి పార్థసారథి పాల్గొన్నారు.

కార్యవర్గం ఎన్నిక

సారంగాపూర్: దుబ్బ రాజన్న ఆలయ కమిటీని 13 మంది సభ్యులతో దేవాదాయ శాఖ గురువారం ఏర్పాటు చేసింది. పెంబట్ల–కోనాపూర్ గ్రామాల్లో వెలసిన ఈ ఆలయంలో మహాశివరాత్రి సందర్భంగా జరిగే జాతర బ్రహ్మోత్సవాలతోపాటు ఏడాది పొడవునా ఉత్సవాలు ఘనంగా సాగుతాయి. కోండ్ర రాంచంద్రారెడ్డి, రంగు శంకర్, మానుక గంగమ్మ, సూర సత్యనారాయణరెడ్డి, పంగ కిష్టయ్య, కల్లెడ గంగాధర్, వాసం శ్రీనివాస్, కొలపాక రవి, పిన్నం సత్యనారాయణ, చెట్ల శేఖర్, మతులాపురం శంకర్, భారతపు గంగయ్య, ఉరుమడ్ల పోచయ్య ఎన్నికయ్యారు.

రాయికల్: కొత్తపేట శ్రీరాజరాజేశ్వర నాగాలయం కమిటీని దేవాదాయశాఖ 8 సభ్యులతో ఏర్పాటు చేసింది. దానవేని రాములు, మాడ జల, బోదాసు రాజన్న, బోదాసు నర్సయ్య, ఏనుగు నాగారెడ్డి, ముక్కెర ముత్యం, బోనగోని భూమాగౌడ్, చెరుకు రాజేశ్వరశర్మ(అర్చకుడు) ఎన్నికయ్యారు.

ఉత్సవాలను విజయవంతం చేయాలి

రాయికల్: కొత్తపేట గ్రామంలోని రాజరాజేశ్వర నాగాలయంలో మహాశివరాత్రి ఉత్సవాలను విజయవంతం చేయాలని తహసీల్దార్ ఖయ్యూం కోరారు. గురువారం కొత్తపేట గ్రామంలో సమన్వయ సమావేశం నిర్వహించారు. జాతర ఉత్సవాలను విజయవంతం చేసేందుకు చేపట్టాల్సిన కార్యక్రమాలపై ప్రణాళికలు రూపొందించారు. ఎంపీడీవో చిరంజీవి, ఈవో విక్రం, తాజా మాజీ సర్పంచులు రాజేశం, తిరుపతి, వెంకమ్మ, అంజయ్య, గంగారెడ్డి, అర్చకుడు రాజేశ్వరశర్మ పాల్గొన్నారు.

ఘనంగా వెంకన్న కల్యాణం

కోరుట్ల రూరల్: మోహన్‌రావుపేట శివారులోని గుట్ట వద్ద గల శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో జాతర ఉత్సవాలు గురువారం ఘనంగా జరిగాయి. ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. స్వామివారి కల్యాణం కన్నుల పండువగా నిర్వహించారు.



ఘనంగా మానసాదేవి విగ్రహ ప్రతిష్ఠ

కోరుట్ల: పట్టణంలోని అభయాంజనేయస్వామి ఆలయంలో నాగేంద్ర సహిత మానసాదేవి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు ఘనంగా నిర్వహించారు. గురువారం యంత్రస్థాపన, కల్యాణోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో పురోహితులు పాలెపు రామకృష్ణ శర్మ, గద్దమీది రాజన్న, ముక్క ధర్మరాజు, దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై ప్రభుత్వ విప్‌కు వినతి



చింతకుంట శివారులో కోతకు గురైన రోడ్డును పరిశీలిస్తున్న ఆది శ్రీనివాస్

కథలాపూర్: చింతకుంట గ్రామానికి అనుబంధమైన చిన్నగూడెంలోని సమస్యలపై ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు గురువారం కాంగ్రెస్ నాయకులు విన్నవించారు. ప్రభుత్వ విప్ మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించారు. తాగునీటి సమస్య తీర్చేందుకు మినీ వాటర్ ట్యాంక్, విద్యుత్ స్తంభాలను సరిచేయడంతోపాటు రాజారాంతండాలో ఇళ్ల మధ్యలో ప్రమాదకరంగా ఉన్న తీగలను సరిచేయాలని గ్రామస్తులు విన్నవించారు. చింతకుంట గ్రామ శివారులో ఒన్నయ్య ఒర్రె వద్ద రోడ్డు వర్షాకాలంలో కోతకు గురైందని, అక్కడ బ్రిడ్జి నిర్మించాలని కోరారు. సంబంధిత అధికారులతో ప్రభుత్వ విప్ ఫోన్‌లో మాట్లాడారు. వీలైనంత త్వరగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులు చెదలు సత్యనారాయణ, బోదాస్ రెడ్డి, లోక నర్సారెడ్డి, అంగ మహేశ్‌యాదవ్, కృష్ణ, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు రూ.1.45కోట్లు మంజూరు

కథలాపూర్: మండలంలోని వివిధ గ్రామాల్లో అభివృద్ధి పనులకు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఎస్‌డీఎఫ్ నిధులు రూ.1.45కోట్లు మంజూరు చేసినట్లు కాంగ్రెస్ మండలాధ్యక్షుడు కాయితి నాగరాజు గురువారం తెలిపారు. కుల సంఘాల భవనాలకు రూ.71లక్షలు, బోరుబావుల ఏర్పాటుకు రూ.28లక్షలు, ప్రభుత్వ పాఠశాలల్లో తాగునీరు, మరుగుదొడ్లు, ప్రహరీలకు రూ.45.50లక్షలు కేటాయించారన్నారు.

మేడిపల్లి: మండలంలోని పలు గ్రామాలకు ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ సహకారంతో ఎస్‌డీఎఫ్ నిధులు మంజూరయినట్లు మండల అధ్యక్షుడు రమేశ్‌రెడ్డి తెలిపారు. కొండాపూర్ గ్రామ ముదిరాజ్ సంఘ భవనానికి రూ.3.70లక్షలు, విలయతబాద్ ఒడ్డెర కుల సంఘ భవనానికి రూ.3లక్షలు, ఉమ్మడి మేడిపల్లి మండల ముదిరాజ్ సంఘం భవనానికి రూ.4లక్షల విలువ గల పత్రాలను అందజేశారు.

కోర్టు సిబ్బందికి సన్మానం

కోరుట్ల: మెట్‌పల్లి మున్సిఫ్ కోర్టులో పని చేసి బదిలీపై వెళ్తున్న సిబ్బందిని మెజిస్ట్రేట్ అరుణ్‌కుమార్, న్యాయవాదులు కోర్టు ఆవరణలో గురువారం సన్మానించారు. కోర్టులో పని చేసిన విశ్వాస్, భాస్కర్ బదిలీ అయ్యారు. మెజిస్ట్రేట్ అరుణ్‌కుమార్ మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉద్యోగికి బదిలీలు తప్పవని, వారు చేసిన సేవలు మాత్రం గుర్తుంటాయన్నారు. మెట్‌పల్లి న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు లింబాద్రి, ఉపాధ్యక్షుడు ఒజ్జెల లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి ఆనంద్, న్యాయవాదులు వెంకటనర్సయ్య, శ్రీనివాస్, రాజ్‌మహ్మద్, వెంకటస్వామి, వెంకటేశ్వర్లు, స్రవంతి, శంకర్‌రెడ్డి, ప్రవీణ్‌రావు, నర్సాగౌడ్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

ప్రభుత్వ వైద్యుడికి సన్మానం

జగిత్యాలరూరల్: ప్రభుత్వ వైద్యుడిగా ఉద్యోగం సాధించిన డాక్టర్ పి.గంగాధర్‌ను గురువారం జగిత్యాల పెరక సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. జిల్లా మాజీ అధ్యక్షుడు దమ్మని బాలముకుందం, మాజీ ఉపాధ్యక్షుడు కట్ట రాజేందర్, నాయకులు నల్లవు మల్లేశం, గోపి లక్ష్మణ్, శ్రీనివాస్, రఘువరణ్ పాల్గొన్నారు.

పరామర్శ

ధర్మపురి: ఇటీవల గుండెపోటుతో మరణించిన మృతుడి కుటుంబ సభ్యులను గురువారం బుగ్గారం జెడ్పీటీసీ బాదినేని రాజేందర్ పరామర్శించారు. కమలాపూర్ గ్రామానికి చెందిన ఉయ్యాల శ్రీనివాస్ గుండెపోటుతో మృతిచెందాడు.

ఉపాధ్యాయులను ఎప్పటికీ మర్చిపోలేం



ఉపాధ్యాయులను సన్మానించిన మాజీ ఎంపీపీ దేవేందర్

ఇబ్రహీంపట్నం: విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను ఎప్పటికీ మర్చిపోలేమని మాజీ ఎంపీపీ నేరేళ్ళ దేవేందర్ అన్నారు. గురువారం తిమ్మాపూర్ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు మహేశ్‌కుమార్, రవీందర్, జగన్, లక్ష్మీనారాయణ, సతీష్‌ను ఘనంగా సన్మానించారు. అనంతరం పదోతరగతి విద్యార్థులకు వీడ్కోలు పలికారు. ప్రధానోపాధ్యాయులు భూపతి, మంజుల, గణేశ్, అశోక్, విద్యార్థులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌కు రాజీనామా

మేడిపల్లి: జిల్లా సర్పంచుల ఫోరం ఉపాధ్యక్షుడు, మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు, ఈదులలింగంపేట గ్రామ సర్పంచ్ వంగ వెంకటేశం మండల అధ్యక్షుడు క్యాతం సత్తిరెడ్డిని కలిసి బీఆర్‌ఎస్ పార్టీకి రాజీనామా సమర్పించారు. గ్రామ యూత్ అధ్యక్షుడు నరేష్ కూడా రాజీనామా చేశారు.